క్లుప్తంగా

నేడు రావుల మల్లన్న బోనాలు

దహెగాం: మండల కేంద్రంలో ఆదివారం రావుల మల్లన్న బోనాల పండుగ నిర్వహించనున్నారు. మండల కేంద్రం సమీపంలో ఉన్న రావుల మల్లన్న ఆలయం వద్ద బోనాలు వండి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లిస్తారు. మండల కేంద్రంతో పాటు పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్, భీమిని, కన్నెపల్లి మండలాల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో జాతర నిర్వహించనున్నారు.

మూడు నాలుకలతో దూడ



మూడు నాలుకలతో జన్మించిన దూడ

బెజ్జూర్: మండలకేంద్రంలో శనివారం గేదెకు మూడు నాలుకలతో ఉన్న దూడ జన్మించింది. మండలకేంద్రానికి చెందిన మేకల పర్వతాలు అనే రైతుకు చెందిన గేదెకు మూడు నాలుకల దూడ ఉదయం జన్మించడంతో వింతను చూసేందుకు స్థానికులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ విషయంపై పశువైద్యాధికారి డాక్టర్ రాకేశ్‌ను సంప్రదించగా జన్యుపరమైన లోపాలతో దూడ జన్మించిందన్నారు.

వృద్ధాశ్రమానికి విద్యుత్ ఉద్యోగుల విరాళం



వృద్ధాశ్రమానికి ఆర్థికసాయం అందజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

రెబ్బెన: టీజీఎస్పీడీసీఎల్ సీఅండ్ఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటైన విద్యుత్ ఉద్యోగుల వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో గల వృద్ధాశ్రమానికి జిల్లా విద్యుత్ ఉద్యోగులు విరాళం అందజేశారు. ప్రతినెలా ఉద్యోగుల జీతాల నుంచి విరాళాలను సేకరించి ట్రస్ట్ ద్వారా అనాథశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు స్వచ్ఛంద సంస్థలకు విరాళాలు అందిస్తున్నారు. దానిలో భాగంగా జిల్లాకు చెందిన విద్యుత్ ఉద్యోగులు గోలేటిలోని న్యూ రైస్‌బో వృద్ధాశ్రమానికి రూ. 20వేల విరాళాన్ని అందించి అండగా నిలిచారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ శేషారావు, ఏవో దేవిదాస్, డీఈ జీవరత్నం, ఫిరోజ్‌ఖాన్, ఏఈ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి

ఆసిఫాబాద్‌అర్బన్: రోజురోజుకు జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, నిర్బంధాలు పెరిగిపోతున్నాయని, జర్నలిస్టులపై దాడులు, నిర్బంధాలను అరికట్టేందుకు వెంటనే జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టాలను అమలు పర్చాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ డిమాండ్ చేశారు. జాతీయ పత్రిక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని టీయూడబ్ల్యూజే కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాశ్‌గౌడ్, హరికృష్ణ, శ్రీనివాస్‌రావ్, సురేశ్‌చారి, రాధాకృష్ణచారి, శ్రీధర్, మిలిన్‌కుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

సిర్పూర్(టి): జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సిర్పూర్(టి) మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో పాటు ఓపీ రోగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు జోగేందర్, నాగరాజు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పైడి సంతోష్, టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ జమీల్ పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షలు

ఇచ్చోడ: మండలంలో అయ్యప్ప దీక్షలు కొనసాగుతున్నాయి, పలువురు యువకులు ఇటీవల అయ్యప్ప దీక్షలు స్వీకరించారు. శనివారం ఉదయం తెల్లవారు జామున స్థానిక హనుమాన్ ఆలయంలో అయ్యప్ప మాలధారులు పూజలు చేశారు. గురుస్వామి అనురాజ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతీ రోజు సన్నిదానంలో పూజలు కొనసాగుతున్నాయి.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

లక్సెట్టిపేట: స్థానిక ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను మండల ప్రత్యేకాధికారి సంజీవరెడ్డి శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యాబోధన, భోజన సౌకర్యం పరిసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. సిలబస్ ఎంత వరకు పూర్తయింది, భోజనం మెనూ ప్రకారం ఇస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి రికార్డులు పరిశీలించారు.

రోడ్డు నిర్మాణంలో నాసిరకం పనులు

- నిబంధనలకు విరుద్ధంగా పొలంలోని మట్టి వాడిన గుత్తేదారు
- ఇంజినీర్ హెచ్చరికతో నాసిరకం మట్టిపై మొరం పూత
- రూ.80 లక్షలతో చేపట్టిన లైన్‌గూడ రోడ్డు పనులు



లైన్‌గూడ రోడ్డు నిర్మాణం కోసం మట్టి తవ్విన ప్రాంతం



నిర్మాణ దశలో లైన్‌గూడ రహదారి

వాంకిడి: మండలంలోని బంబార గ్రామపంచాయతీ పరిధిలో గల లైన్‌గూడ గ్రామానికి వెళ్లే రోడ్డుకు బీటీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎస్టీఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.80 లక్షల చొప్పున బనార్ కొసార, లైన్‌గూడ గ్రామాలకు నిధులు మంజూరయ్యాయి. నూతన రహదారి నిర్మాణానికి నిధులు మంజూరై సుమారు రెండేళ్లు కావస్తుండగా పనులు చేపట్టడంలో గుత్తేదారు తీవ్ర జాప్యం చేశారు. ఇటీవల తిరిగి పనులు ప్రారంభించినప్పటికీ నాణ్యత ప్రమాణాలను మాత్రం పాటించడం లేదని ఆరోపణలు విన్పిస్తున్నాయి. నిబంధనలకు తూట్లు పొడుస్తూ నాసిరకం మట్టి వాడినట్లు విమర్శలు ఉన్నాయి. దశాబ్దాల కాలం నుంచి సరైన రహదారులు లేక ఇబ్బందులు పడుతున్న మారుమూల గ్రామాల్లో నూతన రోడ్లను నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.80 లక్షలతో నిర్మాణం..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం మారుమూల గ్రామాలకు సైతం బీటీ రహదారులు నిర్మించాలనే ఉద్దేశంతో ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులను మంజూరు చేసింది. ఇందులో భాగంగానే వాంకిడి మండలంలోని బంబార గ్రామ పంచాయతీ పరిధిలో గల లైన్‌గూడ, బనార్ కొసార గ్రామాలకు రూ.80 లక్షల చొప్పున నిధులను కేటాయించారు. రోడ్డు, భవన (ఆర్‌అండ్‌బీ) నిర్మాణ శాఖకు నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. మంజూరైన నిధులకు అనుగుణంగా ఎన్‌హెచ్ 363 నుంచి ఒక కిలోమీటరు మేర బీటీ రహదారి నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. ఎన్‌హెచ్ -363 నుంచి గ్రామాలు సుమారుగా 2 నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉండగా మంజూరైన నిధులకు అనుగుణంగా ఒక కి.మీ రహదారి నిర్మాణం మాత్రమే చేపడుతున్నారు.

నిబంధనలకు నీళ్లు..

ప్రస్తుతం లైన్‌గూడ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతుండగా మొదటి నుంచి నాసిరకం పనులు చేపడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రహదారిని చదును చేసిన తర్వాత ముందుగా ఇంజినీర్ సూచించిన మొరం మట్టిని వాడాలి. నీళ్లు చల్లుతూ రోలింగ్ చేసిన అనంతరం మొరం మట్టి 8 ఇంచుల మందంతో ఉండాలి. అలాగే బీటీ రోడ్డుకు ఇరువైపులా ఎడ్లబండ్లు వెళ్లేందుకు గాను, రోడ్డు కుంగిపోకుండా మొరం మట్టినే వాడాల్సి ఉంటుంది. ఆ తరువాత 26 ఎంఎం సైజులోని కంకరను వేసి నీళ్లు చల్లుతూ రోలింగ్ చేయాలి. దీని మందం ఒక ఫీటు ఉండాలి. ఆ తరువాత డాంబర్‌తో రోడ్డు వేయాలి. నూతన రోడ్డు నిర్మాణ సమయంలో ఈ నిబంధనలను పాటించినట్లయితే రహదారి దశాబ్దాల కాలం పాటు కుంగిపోకుండా, గుంతలు పడకుండా ఉంటుంది. అయితే రహదారి నిర్మాణ ప్రారంభ దశలోనే సదరు గుత్తేదారు నాసిరకం పనులతో పునాదులు వేశారు. ఇంజనీర్ నిర్ధారించిన మొరం మట్టి వేయాల్సి ఉన్నా స్థానికంగా పంట చేలల్లో దొరికే మట్టిని వాడారు. పొలం యజమానితో మాట్లాడుకుని పొలంలో భారీగా తవ్వకాలు జరిపి మట్టిని బీటీ రోడ్డు నిర్మాణానికి వాడారు. గమనించిన ఇంజనీర్ పొలం నుంచి తెచ్చి వాడిన మట్టిని తొలగించి నాణ్యమైన మొరం మట్టిని వాడాలని హెచ్చరించారు. కానీ రోడ్డుకు వాడిన మట్టిని తొలగించకుండా దాని పైనుంచే మొరం మట్టిని పూతలా చల్లినట్లు తెలుస్తోంది. దీంతో రోడ్డు నాలుగు కాలాల పాటు నిలుస్తుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న నాసిరకం మట్టిని ఇప్పటికీ తొలగించలేదు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఇంజనీర్‌ను వివరణ కోరగా నాసిరకం మట్టిని తొలగించి నాణ్యమైన మొరం వేయించామన్నారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా ఉన్న మట్టిని సైతం తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'సంవిధాన్ దివస్' విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐక్యవేదిక ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్ష భూమిలో ఈనెల 24వ తేదీన నిర్వహించే భారత రాజ్యాంగ దివస్ (సంవిధాన్ దివస్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారతీయ బౌద్ధసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద సమతా భారత్ ఐక్య వేదిక ఆధ్వర్యంలో సంవిధాన్ దివస్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి జిల్లాలోని 15 మండలాలకు చెందిన నాయకులు, వివిధ కుల సంఘాలకు సంబంధించిన నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమానికి రాజ్యాంగంపై అవగాహన కల్పించడానికి హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఖమ్మం జిల్లా నుంచి సీనియర్ డాక్టర్ గోపీనాథ్‌లు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వినేష్, ఆత్మారాం, సంతోష్, తుకారాం, వినోద్, సుధాకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వరిలో పంట కోత ప్రయోగం



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కౌటాల: మండలంలోని గుడ్లబోరి గ్రామ శివారులో గల వరి పొలంలో శనివారం వ్యవసాయ అధికారులు పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి పెందోర్ ప్రేమలత మాట్లాడుతూ పంట కోత ప్రయోగంతో పంట ఎంత దిగుబడి వస్తుందని అంచనా వేయవచ్చన్నారు. ఈ ప్రయోగంతో పంట నష్టం జరిగినప్పుడు దిగుబడి అంచనా ప్రకారం నష్టపరిహారం అందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. రైతులు పంట మార్పిడి చేసి అధిక దిగుబడి సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో చౌదరి అంజన్న, రైతులు పాల్గొన్నారు.

గడువులోగా సర్వే పూర్తి చేయాలి



లక్ష్మినగర్‌లో సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

వాంకిడి: నిర్ణీత గడువులోగా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం వాంకిడి జీపీ పరిధిలోని లక్ష్మినగర్‌లో నిర్వహిస్తున్న సమగ్రసర్వేను ఎంఈవో శివచరణ్‌తో కలిసి పరిశీలించారు. ఎన్యూమరేటర్లకు కేటాయించిన బ్లాకుల్లో నమూనాలోని అంశాల వారీగా వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్ ఉన్నారు.

చదువు సాగేదెలా..?



మూసివేసిన పున్నగూడ పాఠశాల

- పది పాఠశాలల్లో భర్తీ కాని ఉపాధ్యాయ పోస్టులు
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టని ఐటీడీఏ అధికారులు

నార్నూర్: సర్కారు బడిలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం విద్య అందని ద్రాక్షగానే మారుతోంది. గ్రామాల్లోని పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు వ్యవసాయ కూలీలుగా, డ్రాపౌట్‌లుగా మారుతున్నారు. దీంతో విద్యాభివృద్ధి కుంటుపడుతోంది. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయులు, సీఆర్‌టీల బదిలీలతో మారుమాల గ్రామాల పాఠశాలలో పోస్టింగ్‌లు ఎవరూ తీసుకోకపోవడంతో పాఠశాలలు తెరుచుకోలేదు. కనీసం ఐటీడీఏ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంపై ఆదివాసీ గిరిజన సంఘాలు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులు లేకపోవడంతో కొందరు విద్యార్థులు ఆడుకుంటూ, మరి కొందరు కుటుంబ సభ్యులకు ఆసరాగా ఉంటున్నారు.

పోస్టులు ఖాళీ..

జిల్లాలోనే మారుమూల మండలం గాదిగూడలో ఆదివాసీ గిరిజనులు అధికంగా నివాసం ఉంటున్నారు. మొత్తం 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం పది గ్రామాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠశాలలు తెరుచుకోలేదు. దీంతో గిరిజన విద్యార్థులకు విద్య అందడం లేదు. మండలంలోని పున్నగూడ, రుప్పాపూర్, శివనారా, అలిగూడ, సెడ్వాయి, కొలామా, మారెగాం, హీరాపూర్, చిన్నకుండి, కొత్తపల్లి(జీ) గ్రామాల్లోని పాఠశాలలో ఉపాధ్యాయులు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఒక్కో పాఠశాలలో దాదాపు 20 నుంచి 30 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆరుబయటే ఆడుతూ కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి



ఏజెన్సీ ప్రాంతంలో ఐటీడీఏ ఉన్నత విద్యపై దృష్టి సారించకపోవడంతో గిరి విద్యార్థులకు విద్య అందడం లేదు. పది పాఠశాలలో ఉపాధ్యాయలు లేకపోవడం బాధాకరం. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని ఉపాధ్యాయులను నియమించాలి.

- పెందూర్ సంతోష్, విద్యార్థి సంఘం నాయకుడు

విద్యార్థుల భవిష్యత్‌పై దృష్టి సారించాలి



పేద విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఐటీడీఏ అధికారులు ఉపాధ్యాయులను నియమించాలి. ఉపాధ్యాయులు లేక 10 పాఠశాలలు మూతపడి ఉన్నాయి. ఇప్పటికే ఐటీడీఏ పీవోను కలిసి వినతిపత్రం అందించినా ఫలితం లేదు.

- మధు, విద్యార్థి సంఘం నాయకుడు

బాధిత కుటుంబాలకు పరామర్శ



పెంచికల్‌పేట్: పరామర్శిస్తున్న కోనేరు కోనప్ప



వాంకిడి: పరామర్శిస్తున్న దుర్గం ప్రశాంత్

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన లస్మయ్య, ఎల్లూర్ గ్రామానికి చెందిన బాయక్క, అగర్‌గూడ గ్రామానికి చెందిన అనూష ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప శనివారం పరామర్శించి సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, సంజీవ్, సుధాకర్, రాజన్న, నాయకులు తిరుపతి, సాజిద్, బండన్న, ఖైరాత్, వెంకన్న, మారన్న, కొండన్న, రాజేశ్వర్, అశోక్ ఉన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: మండలంలోని ఇందాని గ్రామానికి చెందిన చాప్లె ప్రకాశ్ ఇల్లు శుక్రవారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో కాలిపోగా శనివారం కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ బాధితులను పరామర్శించారు. ఆర్ఐ శైలజ అగ్ని ప్రమాదంలో జరిగిన ఆస్తి నష్టంపై పంచనామా నిర్వహించి నివేదికను ప్రభుత్వానికి అందజేసి త్వరగా నష్ట పరిహారం అందేలా చూస్తామని బాధితులకు హామీ ఇచ్చారు.

కుక్కలున్నాయ్.. జాగ్రత్త!

- ప్రజలు, జీవులపై దాడులు
- జంకుతున్న జనాలు
- పట్టించుకోని అధికారులు



కౌటాలలో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

కౌటాల: జిల్లావాసులు వీధి కుక్కల దాడులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో వీధి కుక్కలు సృష్టిస్తున్న బీభత్సానికి పిల్లలు, పెద్దలు నానా అవస్థలు పడుతున్నారు. కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలు, మేకలు, గొర్రెల మందలపై దాడి చేస్తున్నాయి. వీటి బారి నుంచి రక్షణ కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. రోజూ ఎదో ఒక చోట శునకాలు జనంపై పడుతూనే ఉన్నాయి. ఈ దెబ్బతో ప్రజలు రోడ్డుపైకి రావాలంటేనే.. ఏ మూల నుంచి ఏ కుక్క వచ్చి కరుస్తుందోనని వణికిపోతున్నారు. దీంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. పగలు, రాత్రివేళ రోడ్డెక్కితే కుక్కలు భయపెడుతున్నాయి. అధికారులు, పాలకవర్గాలు వీటి నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడంతో వీటి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

రెచ్చిపోతున్నాయి..

హోటళ్లు, చికెన్ షాపులు, ఫంక్షన్ హాళ్లు.. వ్యర్థాలను సక్రమంగా నిర్వహించకపోవడంతో వాటికి అలవాటు పడిన శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. నిస్సహాయులైన చిన్నారులు, వృద్ధులు, మహిళలను చుట్టుముట్టి దాడిచేస్తున్నాయి. ప్రతి ఆరునెలలకోసారి ఇళ్లలో ఉండే పెంపుడు కుక్కలకు ఇంజక్షన్లు వేయిస్తారు. వీధికుక్కలకు స్థానిక సంస్థలు ఇంజక్షన్లు వేయించాలి. ఇలా చేయిస్తే కొన్నిసార్లు కరిచినా ప్రజల ప్రాణాలకు ముప్పు ఉండదు. కాని సిబ్బంది అలాగే వదిలేస్తున్నారు. వాటి కట్టడికి కు.ని చికిత్స చేయాలి. ఒక్కో కుక్కకు సుమారు రూ. 2వేల ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని నాలుగైదేళ్లుగా ఒక్క శస్త్రచికిత్స చేసిన దాఖలాలు లేవు. స్థానిక పీహెచ్‌సీలో కుక్క కాటుకు వ్యాక్సిన్ వేస్తుండగా, తీవ్ర గాయాలు అయితే వ్యాక్సిన్ల కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కుక్క కరిచిన బాధితులకు మెరుగైన వైద్యం అందడం లేదని ప్రజలు వాపోతున్నారు.

నియంత్రణేది..

చింతలమానెపల్లి మండలం రుద్రాపూర్ గ్రామంలో ఈ నెల 8న ఏడుగురు పిచ్చికుక్క దాడిలో గాయాలపాలయ్యారు. ఇంటి సమీపంలో ఉన్న వారిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చడంతో బెజ్జూర్‌లోని పీహెచ్‌సీలో చికిత్స తీసుకున్నారు. గ్రామంలో కుక్కల బెడద పెరిగిందని అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో కుక్కల దాడి బారిన పడకుండా రాత్రి సమయంలో స్థానిక యువకులు కర్రలతో గస్తీ కాస్తున్నారు. వీధి కుక్కల నియంత్రణ బాధ్యత స్థానిక సంస్థలదే. అయినప్పటికీ సిబ్బంది కొరత, నిధుల లేమి, ఇతరత్రా కారణాలతో పట్టించుకోవడం లేదు. పలు శాఖల ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి.. ప్రతినెలా సమావేశమై కుక్కల సంతతి నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై చర్చించాల్సి ఉంటుంది. అయితే అటువంటి సమీక్షలే కానరావడం లేదు. వీధి కుక్కలతో వేగలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. గ్రామాల్లో వీధి కుక్కలు దాడులు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కుక్కల బెడద లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు. సిబ్బంది కొరత, నిధుల లేమితో నియంత్రణ చర్యలు తీసుకోవడం లేదని, రోడ్డు పక్కన ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలను పడేయొద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు పేర్కొంటున్నారు.

'స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలి'

తాంసి: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్ డిమాండ్ చేశారు. శనివారం భీంపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గత నాలుగేళ్లుగా బకాయిలు చెల్లించడం లేదన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అంకిత్, అభిషేక్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

బోథ్: మండల కేంద్రానికి చెందిన టీకులపల్లి మౌనిక అనే విద్యార్థికి ఓ ప్రైవేట్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్‌లో సీటు వచ్చింది. కానీ ఫీజు చెల్లించేందుకు డబ్బులు లేకపోవడంతో చదవలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని స్థానికుడు సామాజిక కార్యకర్త అనిల్ మాసం ద్వారా తెలుసుకున్న అమెరికాలోని ఫిలడెల్ఫియా తెలంగాణ అసోసియేట్ వారు రూ. 50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. డీడీని శనివారం మౌనికకు అందజేశారు. కార్యక్రమంలో పోటీ పరీక్షల నిపుణులు రమణ గౌడ్, సాయికృష్ణ, అనిల్ మాసం, తుల హరీష్, గంగాధర్, రమేష్, పోసాని, కృష్ణ, సుగుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల ఎస్సీ హాస్టల్‌లో బోర్‌వెల్ ఏర్పాటు

నెన్నెల: ఎస్సీ హాస్టల్‌లో నీటి సదుపాయం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నెన్నెల ఎస్సీ హాస్టల్‌లో నీటి సమస్య గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు బోర్‌వెల్ డ్రిల్లింగ్ పనులను శనివారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. రూ.2.50లక్షల వ్యయంతో బోరు వేసి కొత్త మోటారు కనెక్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. బోర్‌వెల్ ఏర్పాటుతో తమ ఏళ్ల నాటి నీటి సమస్య తీరిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏఎస్‌డబ్ల్యూవో రవీందర్‌గౌడ్, నెన్నెల వార్డెన్ జయశంకర్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

నార్నూర్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న నిరుపేద గిరిజన విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు డిమాండ్ చేశారు. శనివారం గాదిగూడ మండలంలోని లోకారి మినీ గురుకులం, ఝరి ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. పేద విద్యార్థుల చదువు కోసం ప్రభుత్వం కోట్ల రుపాయలు ఖర్చు పెడుతున్నా.. క్షేత్ర స్థాయిలో మాత్రం కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చలికాలం ప్రారంభం కావడంతో వసతి గృహాల్లో విద్యార్థులకు దుప్పట్లు లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కొన్ని గదులకు కిటికీలు లేకపోవడంతో అలాగే నిద్ర పోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, ఉపాధ్యక్షుడు మధు పాల్గొన్నారు.